పంటల బీమా.. రైతుకేది ధీమా

- జీమాకు కూటమి ప్రభుత్వం మంగళం
- ప్రీమియం చెల్లిస్తేనే జీమా వర్తింపు
- అన్నదాతలకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- భారం పడకుండా ప్రీమియం చెల్లింపు


పంట బీమాపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు(ఫైల్)


సాగులో ఉన్న మినుము పంట

బనగానపల్లె రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల వల్ల దెబ్బతింటే అండగా నిలవాల్సిన ప్రభుత్వం మొండి చెయ్యి చూపిస్తే అన్నదాతల పరిస్థితి వర్ణ ణాతీతంగా ఉంటుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సిం ది పోయి వారిపై మరింత భారం వేసే నిర్ణయాలు తీసుకుంటోంది. గతంలో చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో రైతులకు ఉచిత కరెంట్ ఇస్తే బట్టలు ఆరేసుకోవాలని ఎద్దేవా చేసిన విషయం రైతులు ఇంకా మరిచిపోలేదు. మళ్లీ అదే ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు రైతులు పేర్కొం టున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల కోసం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకా నికి కూటమి ప్రభుత్వం మంగళం పాడడమే ఇం దుకు ఉదాహరణ.

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ

పంట నష్టపోయే రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఖరీఫ్ సీజన్ నుంచే ఉచిత పంట బీమా పథకానికి శ్రీకారం చుట్టారు. రైతులు సాగు చేసిన పంటల ను గ్రామస్థాయిలో ఉన్న సచివాలయ సిబ్బంది ద్వారా ఈక్రాప్ చేయించారు. రైతులు వేసిన పంటల న్నిం టికీ బీమాను ప్రభుత్వమే చెల్లించింది. దీంతో పంట నష్టం కూడా ఏ సీజన్‌కు సంబంధించి ఆ సీజన్‌లోనే రైతుల ఖాతాలో పంటనష్టం పరిహారాన్ని వేసింది. దీంతో రైతులకు ఆర్థిక ఇబ్బందులు ఉండేవికావు.

రైతులే పంటల బీమా చెల్లించాలి

ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని రద్దు చేసింది. రబీ సీజన్‌కు సంబంధించి పంట బీమా ప్రీమియం రైతులే చెల్లిం చాలని నిర్ణయం తీసుకుంది. బనగానపల్లె నియోజకవర్గం లోని బనగానపల్లె, కోవెల కుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండ లాల్లో రబీలో సుమారు 50 నుంచి 60వేల హెక్టార్లలో రైతులు వరి, మొక్కజొన్న, కంది, శనగ, మినుము తదితర పంటలను సాగు చేస్తున్నారు.

పంట	ప్రీమియం (ఎకరాకు)
వరి	రూ. 630
మొక్కజొన్న	రూ.540
మినుము	రూ.265
వేరుశనగ	రూ.480
పప్పుశనగ	రూ.420
జొన్న	రూ.297
టామాట	రూ.1500

గత ప్రభుత్వంలాగే కూటమి ప్రభుత్వం కూడా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. రైతు భరోసా కిం ద పెట్టుబడి సాయం కూడా ప్రభుత్వం ఇవ్వలేదని, అప్పులు చేసి వ్యవసాయం చెయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా 2024–25 రబీ సీజన్‌కు ప్రీమియం చెల్లింపునకు డిసెం బర్ 15వ తేదీ వరకు.. వరి పంటకు మాత్రం ఈ నెల 30వ తేదీ ప్రభుత్వం గడువు విధించింది.

గతంలో పైసా చెల్లించలేదు



గత వైఎస్సార్‌సీపీ హయాంలో పంట బీమా ప్రీమియం కోసం పైసా కూడా చెల్లించలేదు. మా గ్రామంలో ఉన్న ఆర్బీకే సిబ్బంది పొలం వద్దకు వచ్చి ఈ క్రాప్ నమోదు చేసుకుని వెళ్లేవారు. ఆ తరువాత పంట నష్టపరిహారం మా ఖాతాలోనే జమ అయ్యింది. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడిసాయం ఇవ్వలేదు. ఇప్పుడు బీమా కూడా రైతులే చెల్లించాలని పేర్కొనడం అన్యాయం. **–శ్రీనివాసరెడ్డి, రైతు, వెంకటాపురం**

ప్రభుత్వమే భరించాలి



గత ప్రభుత్వం అమలు చేసిన పంటల బీమా రద్దు చేయడం సరికాదు. పంటబీమాకు సంబం ధించి ప్రీమియం ప్రభుత్వమే భరించాలి. రబీ సీజన్‌లో పంట బీమాను కొత్త విధానంలో ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అప్పగించడం జరి గింది. దీని వల్ల రైతులకు భారం తప్ప ఉపయోగంలేదు. ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తే కొంత వరకైన రైతు లకు ఉపశమనం ఉంటుంది. **–సురేష్‌రెడ్డి, రైతు, తిమ్మాపురం**

రైతులే ప్రీమియం చెల్లించాలి



రైతులు సాగు చేసిన పంటకు బీమా వర్తిం చాలంటే రైతులే ప్రీమియం చెల్లించాలి.ఈ విషయాన్ని రైతులకు అవగాహన కల్పిస్తు న్నాం. అన్ని పంటలకు ఈ నెల 15వ తేదీ.. వరికి మాత్రం ఈనెల 30వ తేదీ వరకు గడువు ఉంది. ప్రకృతి విపత్తులు సంభవిస్తే ప్రభుత్వం ద్వారా పరిహారం అందుతుంది. **–సుబ్బారెడ్డి, మండల వ్యవసాయాధికారి, బనగానపల్లె**

క్లుప్తంగా

ఎయిడ్స్‌పై లారీ డ్రైవర్లకు అవగాహన


డ్రైవర్లకు సూచనలు ఇస్తున్న వైద్యులు

కొలిమిగుండ్ల: రామ్‌కో సిమెంట్స్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లకు సోమవారం డాక్టర్ శశిధర్ అవ గాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. వ్యాధి నిర్మూలనలో చికిత్స కన్నా నివారణే ముఖ్యమన్నారు. ఎయిడ్స్ బారిన పడకుండా లారీ డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఎయిడ్స్ ఎలా సోకుతుంది, నివారణ చర్యలు తదితర సల హాలు అందించారు.

కలప ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన కలప ట్రాక్టర్

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని బనగానపల్లె రహదారిలో సోమవారం కలప ట్రాక్టర్ బోల్తా పడింది. బేతంచెర్ల నుంచి బనగానపల్లె వైపు కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు గొర్రెల మం ద అడ్డురావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్‌పైన ఉన్న కూలీలు అప్రమత్తమై కిం దకు దూకడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహ నంలో ఆస్పత్రికి తరలించారు.

ఈ–క్రాప్ తప్పనిసరి


రంగాపురంలో పంట నమోదు చేస్తున్న సిబ్బంది

బేతంచెర్ల: మండలంలోని రైతులు రబీలో సాగుచేసిన పంటలకు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమా ర్ అన్నారు. సోమవారం మండ పరిధిలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ భారతి ఆధ్వర్యంలో శనగ పంటకు ఈక్రాప్ నమోదు చేశారు. దీని వల్ల రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధర, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తిస్తాయన్నారు.

ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ


ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రం లో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమ వారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకా లు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపా ర్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలు వుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సర్పంచ్ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల అందజేత


దుస్తులు, చెప్పులు అందుకున్న పారిశుద్ధ్య కార్మికులు

బేతంచెర్ల: గ్రామంలో పరిసరాలను పరిశుభ్రం గా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరిం చాలని సర్పంచ్ ఏస్తేరమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ సిమెంట్ నగర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ వర్క్స్ సిబ్బం దికి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంక టేశ్వర్లు దుస్తులు, చెప్పులను పంపిణీ చేశారు.

వసతి గృహం విద్యార్థులకు కార్పెట్ల పంపిణీ

బనగానపల్లె రూరల్: మండలంలోని ఇల్లూరు కొత్తపేట ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు సోమవారం కార్పెట్స్‌ను పంపిణీ చేశారు. వసతి గృహం సంక్షేమశాఖ అధికారి మునిరాజు మొత్తం 167 మంది విద్యార్థులకు కార్పెట్స్‌ను అందజేశారు.

ముచ్చట్ల మల్లికార్జునస్వామి సేవలో సీఐలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ముచ్చట్ల మల్లి కార్జునస్వామిని బేతంచెర్ల సీఐలు డి.వెంకటేశ్వ రరావు, అశోక్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ శర్మ వారికి స్వాగతం పలికారు. స్వామివారికి పూజల అనంతరం తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలతో సత్కరించారు.

రేపటి నుంచి చిన్నమ్మ ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామం లో వెలసిన చిన్నమ్మ ఆశ్రమంలో బుధవారం నుంచి 68వ ఆరాధనోత్సవాలు నిర్వహించను న్నట్లు ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించే ఆరాధనోత్స వాల్లో ప్రతి రోజు దక్షిణామూర్తి పూజలు, శ్రీరా మతీర్థ సేవా సత్సంగం వారితో గీతాపారాయ ణం, విష్ణుసహస్రనామ పారాయణం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, తదితర కార్యక్రమాలు ఉం టాయని వివరించారు. శుక్రవారం ఆశ్రమ ఆవ రణలో చిన్నమ్మ విగ్రహ ప్రతిష్ట ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపు రం సర్పంచ్ బొల్లవరం ప్రమీలమ్మ భర్త, మాజీ సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్ రెడ్డి నవంబర్ 20వ తేదీ అనారోగ్యంతో మృతిచెందారు. సోమవా రం గ్రామంలో జరిగిన సంస్మరణ సభకు మాజీ మంత్రి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, ఆర్‌ఎస్ రంగాపురం మాజీ సర్పంచ్ జగన్ మోహన్ రెడ్డి, మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, నాయ కులు బుగ్గన కుమార్‌రెడ్డి హాజరై నివాళులర్పిం చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, గజేంద్రారెడ్డి, మన్ మోహన్‌రెడ్డి, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: లోక్ అదాలత్ ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి తంగ మణి అన్నారు. ఈ నెల 14వ తేదీ జరిగే మెగా లోక్ అదాలత్‌పై సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో ఆర్డీఓ కేపీ నరసింహులు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, పట్టణంలోని బ్యాంక్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్ గురించి ప్రజల్లో అవ గాహన కల్పించి కేసుల పరిష్కారానికి కృషి చేయా లన్నారు. బ్యాంకులకు సంబంధించిన మొండిబకా యిలు తదితర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో స్టేట్ బ్యాంక్, యూని యన్ బ్యాంక్, కెనరా బ్యాంక్, రాయలసీమ ప్రగతి గ్రామీణబ్యాంక్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మించాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

డోన్ టౌన్: ధర్మారం గ్రామంలో ఎస్సీలకు కేటా యించిన మిగులు భూమిలో కల్యాణ మండపం, నీటి ట్యాంకు నిర్మించాలని ఎస్సీలు సోమవారం తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 848–ఎఫ్‌లో ఎస్సీ కాల నీకి స్థలం ఇచ్చారని.. అక్కడ మిగిలిన ఉన్న 50 సెం ట్ల ప్రభుత్వ భూమిలో కల్యాణ మండపం, నీటిట్యాంకు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. విచారణ చేసి తగు చర్యలు తీసుకుం టామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈశ్వరయ్య, బాలరంగడు, హరికృష్ణ, పెద్ద రంగడు, శేఖర్, రం గడు, వెంకటరాముడు, సాలన్న, పరుశరాముడు, బాలన్న పాల్గొన్నారు.

పందుల బెడద నుంచి రక్షణ కల్పించండి


కమిషనర్‌కు వినతిప్రతం అందజేస్తున్న రైతులు

బేతంచెర్ల: పట్టణంలో ఆవులు, పందుల నుంచి పం టలకు రక్షణ కల్పించాలని రైతు సంక్షేమ సంఘం నాయకులు శ్రీధర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, కానాల సుబ్బారెడ్డి, రమణారెడ్డి కోరారు. సోమవారం తహ సీల్దార్ ప్రకాశ్‌బాబు, సీఐ వెంకటేశ్వరరావు, కమిష నర్ హరి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి పల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం పద్మావతి తెలి పారు. నవంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు విశా ఖపట్నంలో జరిగిన అండర్–14 హాకీ క్రీడల్లో పాఠశాలకు చెందిన సంకటి సింధు, అనుపూరి లక్ష్మీధర్మతేజా, గుంటూరులో జరిగిన బేస్‌బాల్ అండర్–17 విభాగంలో శివ తేజస్విని, బైరిపో గుల మహిత సత్తా చాటారని చెప్పారు. అలాగే అనంతపురం జిల్లాలో జరిగిన సాఫ్ట్‌బాల్ అండ ర్–17 విభాగంలో మారం భరత్ కుమార్, గుం టూరులో జరిగిన ఈత పోటీల్లో సి.రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు హరికృష్ణను అభినందించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

కోవెలకుంట్ల: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉం డాలని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సూచించారు. పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో సోమవారం సైబర్ భద్రత, సైబర్ మోసా లపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులు సెల్‌ఫోన్లకు పం పే లింక్‌లు తెరవకుండా వెంటనే వాటిని డిలీట్ చేయాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్లు చేసి బెదిరింపులకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. నేరగాళ్లు సైబర్ బుల్లీయింగ్‌కు పాల్పడితే చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. సైబర్ నేరాలపై ప్రజలను చైతన్య వంతులను చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉం దన్నారు. సీనియర్ న్యాయవాది ఆరికట్ల మల్లికార్జు నరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాప కులు భాస్కర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, లక్ష్మిదేవి, అన్న పూర్ణ, సంటిరెడ్డి పాల్గొన్నారు.

మిరపలో సస్యరక్షణపై అవగాహన


రైతులకు సూచనలిస్తున్న ఉద్యానవన అధికారిణి

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప పంటలో సస్యరక్షణ చర్యలు చేప ట్టాలని కోవెలకుంట్ల ఉద్యానవనశాఖ అధికారిణి ధరణి రైతులకు సూచించారు. సోమవారం మండ లంలోని అమడాల, సొదరదిన్నె గ్రామాల్లో మిరప పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మిరపలో తామర పురుగు అధికం గా ఉన్నట్లు గుర్తించామన్నారు. నివారణకు ఎకరాకు 50 నుంచి 100 వరకు జిగురు అట్టలను పైరులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే లీటరు నీటికి ఒక ఎంఎల్ వేపనూనె కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటికి 2 ఎంఎల్ డైమిథోయేట్, 0.75 ఎం ఎల్ లాంబ్డసైహలోత్రీన్ కలిపి పిచికారీ చేసుకో వాలని తెలిపారు. లేదా లీటరు నీటికి 0.75 ఎంఎల్ స్పైరోటెట్రామల్ లేదా 0.25 ఎంఎల్ స్పైనోషెడ్ కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయశాఖ అసి స్టెంట్ శశిరేఖ, రైతులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవానికి ఏర్పాట్లు

కొలిమిగుండ్ల: కనకాద్రిపల్లెలోని అయ్యప్పస్వామి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు సోమవారం తెలి పారు. బుధవారం ఉదయం స్వామికి అభిషేకం, హోమంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బనగానపల్లె: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురు గా ఉన్న నూకల రెసిడెన్సీలో పేకాట ఆడుతున్న ఆరు గురిని అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలి పారు. సోమవారం రెసిడెన్సీలో పేకాట ఆడుతు న్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు చెప్పారు. మధుసూదన్, జగత్‌విఖ్యాత్‌రెడ్డి, బి.వెంక టేశ్వరరెడ్డి, ఎస్. మల్లికార్జునరెడ్డి, శివప్రకాష్‌రెడ్డి, బాలకృష్ణలను అరెస్టు చేసి వారి వద్ద రూ.9400ల ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

6న వృషభాల రాతిదూలం పోటీలు

సంజామల: కాశిరెడ్డి నాయన 29వ ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ ఆకుమల్లలో న్యూ కేటగిరి వృషభాల రాతి దూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పోచా శంకర్ రెడ్డి, మౌళీశ్వర్‌రెడ్డి తెలిపారు. విజే తలకు వరుసగా రూ.60 వేలు, రూ. 50 వేలు, రూ.40 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అంద జేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వృషభాల యజమానులు నిర్వాహకులను సంప్రదించాలని పేర్కొన్నారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మం డలంలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని చిరుజల్లులు కురిశాయి. చలిగాలుల ప్రభావం ఉండడంతో జనం చాలా వరకు ఇళ్లకే పరిమితమ య్యారు. తుపాన్ ప్రభావం ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంటపై తీవ్ర ప్రభావం పడనుంది. ఇటీవల కురిసిన పొగమంచు వల్ల పూత దెబ్బ తింది. ప్రస్తుతం వర్షం కురుస్తుండడంతో పూత రాలిపోయే ప్రమాదముందని రైతులు వాపో తున్నారు. మరో పక్క రబీలో సాగు చేసిన శనగ రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. విత్తనం వేసనప్పటి నుంచి వర్షపాతం నమోదు కాలేదు. తుపాన్ వల్ల మోస్తరుకు మించి వర్షం కురిస్తే శనగకు మేలు జరుగుతుందని రైతులు ఆశించారు. మొత్తంగా ఖరీఫ్ రైతులకు నష్టం మిగిల్చగా, రబీలో సాగు చేసిన శనగ రైతులకు కొంత వరకు ఉపశమనం కలిగించనుంది.

స్వయం ఉపాధిపై అవగాహన సదస్సు

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వయం ఉపాధిపై హెచ్‌ఎం సీతరావమ్మ ఆధ్వర్యం లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహిం చారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగాల కోసమే చూడకుం డా స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని సూచిం చారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యా యులు హరిప్రసాద్, నరసింహా, మల్లేశ్వరి, వ్యాయమ ఉపాధ్యాయుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

డోన్ రూరల్: రెండు నెలలుగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తున్న మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ పి.సుంకయ్య డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కౌన్సిల్ సమావేశం నిర్వహిం చకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై ఎలాం టి సమాచారం ఇవ్వకుండా ఏకపక్షంగా వ్యవహరి స్తున్నారని ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే అభివృద్ధి


స్థానికులతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి

ప్యాపిలి: వైఎస్సార్‌సీపీ హయాంలో డోన్ నియోజక వర్గం ఎంతో అభివృద్ధి చెందినట్లు ఆ పార్టీ నాయ కుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ప్యాపిలి మండలం హుసేనాపురం గ్రామంలో మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరా ములుతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యక ర్తలతో సమావేశమయ్యారు. అనంతరం గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో రూ. 18 కోట్లతో నిర్మించిన వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల భవనం, బాలుర, బాలికల వసతి గృహాలు, గొర్రెల పెంపకందార్ల శిక్షణ కేంద్రాలను పరిశీలించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా గొర్రెల పెంపకం దార్ల శిక్షణ కేంద్రం హుసేనాపురం గ్రామంలో నిర్మించిన ఘనత అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డికే దక్కుతుందన్నారు. స్థానికంగా పెండిం గ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. హుసేనాపురం సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, ఉపసర్పంచ్ మద్దిలేటి, ఎంపీటీసీ నరసింహులు, నాయకులు మెట్టు వెంక టేశ్వర్ రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, శివా రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి, రామచం ద్రారెడ్డి, జయపాల్, శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దు

డోన్ రూరల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని.. అండగా ఉంటామని బుగ్గన అర్జున్‌రెడ్డి భరోసా ఇచ్చారు. డోన్ మండల పరి ధిలోని సోంపురం, వెంకటనాయునిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజా సమస్యలపై కలిసిక ట్టుగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, రామచంద్రుడు, నాయకులు పోమేష్‌యాదవ్, వేమారెడ్డి, రాంకుమార్‌యాదవ్, మహేశ్వరరెడ్డి, వైఎస్ఎంపీపీ ఎర్రిస్వామి, రాజవర్ధ న్, శివరాంరెడ్డి, జయచంద్రారెడ్డి, సర్పంచ్ జయ చంద్ర, హుసేన్ పాల్గొన్నారు.

వర్షం మిగిల్చిన నష్టం

- చిన్నపాటి వర్షానికే నేలవాలిన వరి


కోవెలకుంట్ల సమీపంలో తుపాన్ ప్రభావంతో నేలవాలిన వరి


పంట ఉత్పత్తులు తడవకుండా కప్పిన పట్టలు

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీ డన ప్రభావంతో సోమవారం తెల్లవారుజామున కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆయా మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి కోత, నూర్పిడి దశలో ఉంది. తుపాన్ కారణంగా కురిసిన చిన్నపాటి వర్షానికే వరి నేలవాలడంతో రైతులు ఆందోళన చెందుతు న్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపు నివారణ, తదితర పెట్టుబ డుల రూపంలో ఎకరాకు రూ. 35 వేల వరకు వెచ్చించగా పంట చేతికందే తరుణంలో వర్షం పడుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూర్పిడి చేసిన వడ్లు, మొక్కజొన్న దిగుబడులు వర్షానికి తడవకుండా పట్టలు కప్పుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వరితో పాటు, మొక్కజొన్న, పత్తి, కంది పంటలు వర్షా నికి దెబ్బతినే అవకాశం ఉండడంతో దిగులు చెం దుతున్నారు.

వ్యాపారులు మోసం చేస్తున్నారని రైతుల ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చిన రైతులు

డోన్ టౌన్: ఆరుగాలం కష్టపడి పంటలు పండించి మార్కెట్‌కు తరలిస్తే వ్యాపారులు తుకాల్లో మోసా లకు పాల్పడుతూ తమ కడుపు కొడుతున్నారని వం దల సంఖ్యలో రైతులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణం లోని కర్నూలు, నంద్యాల రెండు రైల్వేగేట్ల మధ్య ఉన్న పూల మార్కెట్ వ్యాపారులు పాత పద్ధతిలో తుకాలు వేస్తూ దోపిడీకి పాల్పడడంతో రైతుల్లో ఒక్కసారిగా ఆక్రోషం చోటు చేసుకుంది. ప్రతి 10 కేజీలకు రెండు కేజీల తరుగు తీసివేస్తూ వచ్చిన పట్టీలో (బిల్లు) కమీషన్ తీసుకుంటున్నారని ధర్మా రం, కొచ్చెర్వు, గోసానిపల్లె, కన్నపకుంట గ్రామా లతో పాటు ప్యాపిలి, బేతంచెర్ల మండలాలకు చెం దిన రైతులు ఆరోపించారు. చేతి కాటాలతో మోసం చేస్తున్నారన్నారు. స్పందించిన సీఐ ఇంతియాజ్ బాషా తూనికలు కొలతల అధికారి ఖాజా మోహిద్దీ న్‌తో కలిసి పూల మార్కెట్ వ్యాపారులకు కౌన్సెలిం గ్ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలు పునరా వృతం అయితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఎలక్ట్రానిక్ కాటాలు

పూల మార్కెట్‌లో మంగళవారం నుంచి ఎలక్ట్రానిక్ కాటాలు వినియోగించాలని సీఐ ఇంతియాజ్ బాషాతో పాటు తూనికలు కొలతల అధికారి ఖాజా మోహిద్దీన్ పూల వ్యాపారులను ఆదేశించారు.

ప్రధాన రహదారిపై చెత్తకుప్పలు


ముదిగేడు గ్రామంలో రోడ్డుపై వేసిన చెత్తకుప్పలు

సంజామల: మండల పరిధిలోని ముదిగేడు గ్రామం లో రోడ్డుపైనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కోవెలకుంట్ల–అవుకు ఆర్‌అండ్‌బీ రోడ్డుపై కొందరు చెత్తకుప్పలు వేయడంతో దుర్వాసన వెదజల్లుతోం ది. దీనికి తోడు చెత్తకుప్పలకు నిప్పు పెట్టడంతో ఆ పొగ, వాసనకు స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుపై చెత్తకుప్పలు తొలగించి.. ఎవరూ ఇకపై చెత్త పడేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.